## బాధితుడికి సెల్ ఫోన్ అందజేత



రమేశ్‌శర్మకు సెల్ ఫోన్ అందజేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

గోపాల్‌పేట, నవంబర్ 17: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న రమేశ్‌శర్మ రెండునెలల కిందటం గృహలక్ష్మి పథకం దరఖాస్తులు తీసుకునే క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి అతని సెల్‌ఫోన్ దొంగిలించాడు. దీంతో ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసునమోదు చేసిన పోలీసులు, సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గుర్తించిన సెల్‌ఫోన్‌ను శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో బాధితుడికి అందజేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

## కారును ఢీకొట్టిన లారీ

- ప్రమాదంలో భార్య మృతి, భర్తకు గాయాలు



ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

పెబ్బేరు, నవంబర్ 17: మండలంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో భార్య దుర్మరణం చెందగా, భర్త తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై జగదీశ్వర్ కథనం ప్రకారం.. గద్వాలకు చెందిన చిన్నపాటి వెంకటస్వామి భార్య రేణుకాదేవి (52)తో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా.. ప్రమాదానికి గురయ్యారు. వీరు ప్రయాణిస్తున్న కారును తమిళనాడు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో కారు పల్టీలు కొట్టింది. ప్రమాదంలో రేణుకాదేవి అక్కడికక్కడే మృతిచెందగా.. డ్రైవింగ్ చేస్తున్న వెంకటస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. అల్లుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## 21న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వనపర్తి టౌన్, నవంబర్ 17: ఈనెల 21న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు లక్ష్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సత్యన్న శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. 1969–70 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యకర్గ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి పదేండ్లపాటు పలు పత్రికల్లో రాసిన వ్యాసాలతో 'మన కల నిజం' అనే వ్యాస సంకలన ప్రచురణ ఉంటుందన్నారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా మంత్రి నిరంజన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## తాసీల్దార్ కార్యాలయం ఉద్యోగికి కేంద్ర ప్రభుత్వ కొలువు



ఉపసారథి శంకర్

శ్రీరంగాపురం, నవంబర్ 17: మండలంలోని జానంపేటకు చెందిన ఉపసారతి వెంకటయ్య మూడో కుమారుడు ఉపసారతీ శంకర్ ఇటీవల యూపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణులై కేంద్ర ప్రభుత్వ సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమల శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ గ్రేడ్–2 ఉద్యోగాన్ని సంపాదించాడు. శంకర్ ఇదివరకే 2019నుంచి శ్రీరంగాపురం తాసీల్దార్ కార్యాలయంలో మండల ప్రణాళిక గణాంక అధికారిగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగంలో సేవలు అందిస్తున్నాడు. ఈనెల 16వ తేదీన యూపీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో కేంద్ర ప్రభుత్వ జాబ్ వచ్చినట్లు ఈమెయిల్ ద్వారా తెలిపారు. ఉపసారథి శంకర్ వ్యక్తిగత ఈమెయిల్‌కు జాబ్ వివరాలు రావడంతో భార్య పావని కుటుంబ సభ్యులు బాలరాజు, లక్ష్మీనారాయణ, శిరీష , అఖిల, శివ, నిఖిల్, ఈశికతోపాటు బంధువులు, స్నేహితులు సంతోషం వ్యక్తం చేశారు.

# కారు.. ప్రచార జోరు

- ముమ్మరంగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం
- ఇంటింటికీ ఎన్నికల మ్యానిఫెస్టో ప్రతుల పంపిణీ
- మంత్రి నిరంజన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి
- ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న గులాబీశ్రేణులు



పాల్కెపహాడ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గోపాల్‌పేట, నవంబర్ 17: గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల మండలాల్లోని ఆయా గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ సర్కార్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వనపర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించి కారు గుర్తు మీద ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పాల్కెపహాడ్‌లో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో సర్పంచ్ వర్నె రజని, జెన్‌కో రిటైర్డ్ ఎస్ఈ మంద తిరుపతిరెడ్డి, రైతుబంధు గ్రామాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు వడ్డెమాన్ రవి, సోషల్ మీడియా కన్వీనర్ బొగ్గు శివకుమార్, వార్డు సభ్యులు పులేందర్, నాగయ్య, నాయకులు రాజు, నరేందర్, బంగారయ్య, మల్లయ్య, మంజూర్, దిలీప్, రాజు, సుజ్జి, కార్తీక్, లక్ష్మయ్య పాల్గొన్నారు.



పెబ్బేరులో ప్రచారం చేస్తున్న నాయకులు

### మంత్రి నిరంజన్‌రెడ్డికి అండగా ఉందాం

పెద్దమందడి, నవంబర్ 17: నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి మరోసారి మనందరం అండగా నిలిచి భారీ మెజార్టీని అందించాలని బలిజపల్లి సర్పంచ్ డాక్టర్ జయంతి అన్నారు. శుక్రవారం మండలంలోని దొడగుంటపల్లిలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో ఏ నాయకుడు చేయని పనులను సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొంది చేశారన్నారు.వనపర్తి పట్టణంలోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాలను అభివృద్ధి పథంలో నడిపించిన ఏకైక నాయకుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అని అన్నారు. పెద్దమందడి మండలంలోని ప్రతి గ్రామానికి సాగునీరు తీసుకొచ్చి ప్రజల జీవితాలను మార్చిన వ్యక్తి నిరంజన్‌రెడ్డి అని, ఆయనకు మరోసారి అందరం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకా వనపర్తి ఎంతో అభివృద్ధి చెందాల్సి ఉందని, ఈ అభివృద్ధి పనులు ఆగకుండా ఉండాలంటే నిరంజన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ నాయకులు జానకిరాములు, శ్రీనివాస్ రెడ్డి, చెన్నారెడ్డి, గోపాల్, బాలప్ప, సురేశ్, వెంకటేశ్వర్ రెడ్డి, కొమ్ము చెన్నయ్య, పానుగంటి సురేశ్, రవీందర్, ఆటో మల్లయ్య, రాజాగౌడ్, రాములు, తిరుపతయ్య, తదితరులు ఉన్నారు.



దొడగుంటపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### పెబ్బేర్ మండలంలో..

పెబ్బేరు, నవంబర్ 17: మండలంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా కొనసాగుతున్నది. శుక్రవారం మున్సిపల్ పరిధిలోనేకాక, గ్రామాల్లోనూ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డిని రెండో పర్యాయం గెలిపించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. మూడోసారి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల మ్యానిఫెస్టో ప్రతులను పంపిణీ చేశారు.

# నా ఓటును తప్పకుండా వేస్తా..

- ప్రలోభాలకు లొంగబోమని విద్యార్థుల ప్రతిజ్ఞ

పెబ్బేరు, నవంబర్ 17: కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం పెబ్బేరులోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఓటుహక్కుపై అధికారులు అవగాహన కల్పించారు. జిల్లా స్వీప్ నోడల్ అధికారి రామమహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తొలిసారి ఓటు హక్కు వచ్చిన యువతీ, యువకులకు ఓటు ప్రాధాన్యతను వివరించారు. జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారాం మాట్లాడుతూ.. జన్మనిచ్చిన తల్లి కంటే దేశం చాలా గొప్పదని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటు విలువ వెలకట్టలేనిదని, దానిని సక్రమ పద్ధతిలో వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రదీప్, వినోద్‌కుమార్, మిషన్‌శక్తి విభాగం కౌన్సిలర్లు శ్రీవాణి, సుమ, ఎఫ్ఆర్‌వో పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




పెబ్బేరు వీరభద్ర డిగ్రీ కళాశాలలో నా ఓటు తప్పకుండా వేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు